# సాక్షి నిజామాబాద్

ఆదివారం । 27 । ఏప్రిల్ । 2025

I




**ఖరీఫ్ ప్రణాళిక ఖరారు**

ఖరీఫ్ పంటల ప్రణాళిక ఖరారైంది. 5.21లక్షల ఎకరాలకు పైగా పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ అంచనా వేసింది.

- IIలో ▸



**జీపీ కార్యదర్శుల..**

గ్రామసభలను పకడ్బందీగా నిర్వహించడంలో పంచాయతీ కార్యదర్శులు కీలకపాత్ర పోషించాలని డీపీవో శ్రీనివాస్‌రావు అన్నారు.

- IIలో ▸

**వాతావరణం**

గరిష్టం/కనిష్టం 45.3 /22.8

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలున్నాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

## న్యూస్‌రీల్

### డీఏవోకు డీడీఏగా పదోన్నతి



డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్‌కు డీడీఏగా పదోన్నతి లభించింది. జిల్లాలోనే రైతు శిక్షణ కేంద్రం ఉప సంచాలకులుగా పోస్టింగ్ ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పదోన్నతి స్థానంతోపాటు జిల్లా వ్యవసాయాధికారిగా ఈయనే కొనసాగనున్నారు. ఈ సందర్భంగా శాఖ ఉద్యోగులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అయితే వాజిద్ హుస్సేన్ ఈ నెలాఖరున పదవీ విరమణ పొందనున్నారు.

### భారత్ సమ్మిట్‌లో జిల్లా కాంగ్రెస్ నేతలు



నిజామాబాద్ సిటీ: హైదరాబాద్‌లో నిర్వహించిన భారత్ సమ్మిట్‌లో జిల్లాకు చెందిన కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ నేత రాహుల్‌గాంధీ శనివారం ముఖ్య అతిథిగా హాజరైన సమ్మిట్‌లో బోధన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యేలు సుదర్శన్ రెడ్డి, డాక్టర్ ఆర్ భూపతిరెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి పాల్గొన్నారు.

### పది తర్వాత పని వద్దు

- ఎండల తీవ్రతతో మారిన 'ఉపాధి' పని వేళలు



డొంకేశ్వర్(ఆర్మూర్): తీవ్రమైన ఎండలు, వడగాలుల కారణంగా ఉపాధిహామీ పని వేళలు మారాయి. కూలీల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఉదయం 10గంటల తర్వాత పనులు చేయించొద్దని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ప్రభుత్వ ఆదేశాలందుకున్న అధికారులు ఏపీవోలు, ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచనలు జారీ చేశారు. ఉదయం ఆరు గంటలకే కూలీలు పనికి వచ్చేలా చూడాలని, పనిచేసే చోట నీడ, నీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్ల సౌకర్యాలు కల్పించాలని ఆదేశాలు ఇచ్చారు. జిల్లా వ్యాప్తంగా 530 గ్రామ పంచాయతీల్లో ఉపాధిహామీ పనులు జరుగుతున్నాయి. చెరువుల్లో నీళ్లు తగ్గడంతో గుంతలు తవ్విస్తున్నారు. రోజుకు 30వేల మందికి పైగా కూలీలు పనులకు వస్తున్నారు. ప్రస్తుతం ఎండలు రికార్డు స్థాయిలో మండుతున్నాయి. ఎండల తీవ్రత తగ్గే వరకు ఉదయం 6 నుంచి 10 గంటల వరకే ఉపాధిహామీ పనులు చేపట్టాలని ఆదేశాలు వచ్చినట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి సాయాగౌడ్ 'సాక్షి'కి తెలిపారు.


# పెంకుటిల్లు అందాల పొదరిల్లు

## 75 ఏళ్లుగా చెక్కు చెదరని ఇళ్లు

సాలూరలో ఆధునిక హంగులద్దుకున్న ములిగే జయరాం పెంకుటిల్లు

ధాన్యాగారంగా మిద్దెలు.. చంటిబిడ్డ ఊయలకు దూలాల సహకారం.. ఉమ్మడి కుటుంబాలకు చిరునామాలు ఈ పెంకుటిల్లు. 75 ఏళ్లుగా చెక్కు చెదరకుండా ఠీవీగా నిలబడ్డాయి. అందానికి అందం.. ఆహ్లాదం పంచుతున్న ఈ ఇళ్లు నవతరాన్ని పాతకాలం నాటి రోజుల్లోకి తీసుకెళ్తున్నాయి. తాతలు కట్టించిన ఈ పెంకుటిళ్లపై మమకారంతో వారసులు ఆధునిక సొబగులు అద్దుతున్నారు.





సాలూరలోని పెంకుటింట్లో టేకు దూలాలు, వాసాలు



- సీజన్ ఏదైనా ఆహ్లాదకర వాతావరణం
- పర్యావరణ హితం.. పాతకాలం నాటి భవనం
- తాతలు కట్టిన ఇళ్లకు సొబగులు అద్దుతున్న వారసులు

సండే స్పెషల్

బోధన్: పల్లెల్లో అనాదిగా వ్యవసాయమే ముఖ్య జీవనాధారమైన ధనిక, మధ్యతరగతి రైతు కుటుంబాలు తమ అవసరాలకనుగుణంగా మట్టి గోడలతో పెంకుటిళ్లను విశాలంగా నిర్మించారు. పాడి పశువులు, ధన ధాన్యాలు పదిలపర్చుకునేలా అపురూప ఆకృతులతో మట్టి, టేకు కర్రలు ఉపయోగించి కట్టుకున్న ఇళ్లు ఏళ్లు గడిచినా చెక్కుచెదరకుండా దర్శనమిస్తున్నాయి. తాతలు కట్టించిన పెంకుటిళ్లపై మమకారంతో వారసత్వ సంపదగా గుర్తించి వాటికి రూ. లక్షలు వెచ్చించి మరమ్మతులు చేపట్టి ఆధునికతను జోడిస్తున్నారు.

### ఈ పెంకుటిల్లు వయస్సు 75 ఏళ్లు

సాలూర మండల కేంద్రంలోని మధ్యతరగతి కుటుంబానికి చెందిన దివంగత ములిగే వీరన్న కట్టించిన ఇళ్లు ఇది. 75 ఏళ్ల క్రితం పాండ్రి మట్టి (తెల్లమట్టి),పై కప్పు, టేకు కర్రలు, కుమ్మరి పెంకు, దూలాలు, వాసాలు ఉపయోగించి పటిష్టంగా నిర్మించారు. 3 ఫీట్ల వెడల్పాటి మట్టి గోడలు, 15 ఫీట్ల ఎత్తుతో రెండస్తుల ఇల్లు నిర్మించి దశాబ్దాల పాటు అందులోనే నివసించారు. ములిగే వీరన్న మనుమడు ములిగే జయరాం రెండేళ్ల క్రితం పైమొదటి అంతస్తును తొలగించి మరమ్మతులు చేయించారు. పైకప్పు కుమ్మరి పెంకుకు బదులు బెంగుళూర్ పెంకుని అమర్చారు. మట్టి గోడలకు సిమెంట్‌తో ప్లాస్టరింగ్ చేయించి, రంగులద్ది అందంగా తీర్చిదిద్దాడు. ఇంటిలోపల, ముందు భాగంలో ఆహ్లాదకర వాతావరణం కోసం పూలు, పండ్ల మొక్కలు పెంచారు. నాటి మట్టిగోడల పెంకుటిల్లు ప్రస్తుతం అందమైన పొదరిల్లులా దర్శనమిస్తూ ఆకట్టుకుంటోంది. తాత కట్టించిన ఇంటిపై మమకారంతో సౌకర్యవంతంగా మార్చుకొని కుటుంబసభ్యులతో కలిసి జయరాం నివసిస్తున్నాడు. మట్టి గోడలు వేడిని గ్రహించి, ఇళ్లు వేడిగా మారకుండా నిరోధిస్తాయని, దీంతో ఇళ్లంతా చల్లదనంతో ఉంటుందని జయరాం అంటున్నారు. శీతాకాలంలో వెచ్చదనం, వేసవి కాలంలో ఎండలు దంచి కొడుతున్నా చల్లదనాన్ని పంచుతోందని చెబుతున్నారు.



పాతంగల్ మండల కేంద్రంలో బండారి అరుణ్‌కుమార్ సేట్ ఇల్లు

### ఎండకాలం చల్లగా... చలికాలం వెచ్చగా..

రుద్రూర్: ప్రస్తుత ఎండలతో ఏసీ లేదా కూలర్ లేనిదే ఇంట్లో ఉండలేని పరిస్థితి ఉంది. కానీ పాతకాలంలో మట్టితో కట్టిన ఇళ్లు చల్లదనాన్ని పంచుతున్నాయి. పొతంగల్ మండల కేంద్రంలో 75 ఏళ్ల క్రితం బండారు అరుణ్ సేట్ తండ్రి విఠల్ సేట్ నిర్మించిన ఇళ్లు పాతకాలంనాటి వైభవానికి అద్దం పడుతోంది. అప్పట్లో మట్టి, డంగు సున్నం, టేకు కర్రలతో ఈ ఇళ్లు నిర్మించారు. మధ్యలో ఖాళీగా ఉంచి నాలుగు వైపులా రెండతస్తులతో డూప్లెక్స్‌ను మైమరించేలా తీర్చిదిద్దారు.

### ఈ ఇల్లంటే ఎంతో ఇష్టం



మా తాత కట్టిన ఇళ్లంటే మాకెంతో ఇష్టం. ఆ రోజుల్లోనే డూప్లెక్స్‌ను మరిపించేలా కట్టించారు. మా పిల్లల కు సైతం ఈ ఇళ్లంటే ఎంతో మక్కువ. అప్పుడప్పుడు మరమ్మతులు చేయిస్తూ ఇక్కడే నివసిస్తున్నాం. – బండారు హన్మాండ్లు సేట్

# ఇందూరు నుంచి ఓరుగల్లుకు

- ఉమ్మడి జిల్లా నుంచి తరలివెళ్తున్న గులాబీ దండు
- 250 ఆర్టీసీ, 260 ప్రైవేటు బస్సులు, సుమారు 3వేల కార్లు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: బీఆర్ఎస్ నిర్వహించనున్న రజతోత్సవ సభ నిర్వహించనున్న వరంగల్ జిల్లా ఎల్కతుర్తికి ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి గులాబీ శ్రేణులు భారీగా తరలివెళ్లేందుకు రంగం సిద్ధమైంది. మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా శ్రేణుల తరలింపులో అన్నీ తానై వ్యవహరిస్తున్నారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంతోపాటు బాన్సువాడ నియోజకవర్గం నుంచి శ్రేణుల తరలింపు కోసం మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ తగిన ఏర్పాట్లు చేశారు. ఎమ్మెల్సీ కవిత, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల పార్టీ అధ్యక్షులు జీవన్‌రెడ్డి, ముజీబుద్దీన్, మాజీ ఎమ్మెల్యేలు షకీల్, గణేశ్‌గుప్తా, సురేందర్, హన్మంత్‌షిండే, గంప గోవర్ధన్ ఆయా నియోజకవర్గాల వారీగా సన్నాహక సమావేశాలు నిర్వహించి శ్రేణులను సమాయత్తం చేశారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి వెళ్లే వాహనాలకు బహిరంగ సభ వద్ద జోన్ 5లో పార్కింగ్ కేటాయించారు. ఉమ్మడి జిల్లా నుంచి 250 ఆర్టీసీ బస్సులు, 260 ప్రైవేటు బస్సులు ఏర్పాటు చేశారు. అదేవిధంగా కామారెడ్డి జిల్లా నుంచి సుమారు వెయ్యి కార్లు, నిజామాబాద్ జిల్లా నుంచి సుమారు 2వేల కార్లలో నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లనున్నారు. రజతోత్సవ సభ నేపథ్యంలో గులాబీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది.

### 1 నుంచి క్రికెట్ శిక్షణ శిబిరం

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మే 1 నుంచి 31వ తేదీ వరకు వేసవి క్రికెట్ ఉచిత శిక్షణ శిబిరాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చంద్రసేన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 6 నుంచి 8 గంటల వరకు శిక్షణ ఉంటుందని, 12 సంవత్సరాల పైబడి 25 సంవత్సరాల లోపు వయస్సు వారు అర్హులని పేర్కొన్నారు. క్రీడాకారులు తెల్లని దుస్తులు, షూస్, క్రికెట్ కిట్ తమ వెంట తీసుకొని రావాలని, మరిన్ని వివరాలకు కోచ్ నయూమ్(8106066060)ను సంప్రదించాలని సూచించారు.

# ఆధార్ తరహాలోనే భూధార్

- భూ సమస్యల పరిష్కారానికే భూభారతి
- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు



ఆర్మూర్‌లో నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

పెర్కిట్/ నందిపేట / మాక్లూర్: ఆధార్ తరహాలోనే భూధార్ పేరిట ప్రతి భూ కమతానికి ఓ ప్రత్యేకమైన నంబర్ కేటాయించనున్నట్లు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు పేర్కొన్నారు. నిర్ణీత గడువులోగా భూ సమస్యలు పరిష్కారమయ్యేలా భూభారతి చట్టం రైతులకు దోహదపడుతుందన్నారు. ఆర్మూర్, నందిపేట, మాక్లూర్ మండల కేంద్రాల్లో శనివారం నిర్వహించిన భూ భారతి అవగాహన సదస్సులకు కలెక్టర్ హాజరై మాట్లాడారు. భూధార్‌తో భూ ఆక్రమణలు, వివాదాలకు ఆస్కారం ఉండదన్నారు. రైతులకు వారి భూములపై పూర్తి హక్కులు, భరోసా లభిస్తుందన్నారు. ఎక్కడైనా పొరపాట్లు జరిగితే సరి చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. మే, జూన్ నెలల్లో గ్రామాల వారీగా రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూ సమస్యలు ఉన్న రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. 60 రోజుల వ్యవధిలో సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. కొత్త ఆర్‌వోఆర్ చట్టం ప్రకారం తప్పనిసరిగా క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమగ్ర విచారణ చేసిన తర్వాతే రిజిస్ట్రేషన్లు చేస్తారని వివరించారు. భవిష్యత్తులో వివాదాలకు ఆస్కారం లేకుండా పట్టాదారు పాసు పుస్తకాలలో సమగ్ర వివరాలతో హద్దులను పేర్కొంటూ భూ పటాన్ని పొందుపరుస్తారని తెలిపారు. సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న సాదాబైనామా దరఖాస్తులకు భూభారతి చట్టం ద్వారా మోక్షం కలిగిందన్నారు. సదస్సులో అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, ఆర్డీవోలు రాజాగౌడ్, స్రవంతి, తహసీల్దార్లు సత్యనారాయణ, శేఖర్, వసంత రావు, ఎంపీడీవోలు లక్ష్మారెడ్డి, శ్రీనివాసరావు, ఆర్మూర్ ఏఎంసీ చైర్మన్ సాయిబాబా గౌడ్, వైస్ చైర్మన్ విట్టం జీవన్, పీఏసీఎస్ చైర్మన్లు బూరోల్ల అశోక్, మీసాల సుదర్శన్, భరత్‌రెడ్డి, నిజామాబాద్ ఏఎంసీ డైరెక్టర్లు ఎస్ వెంకటేశ్వర్ రావు, పెంట ఇంద్రుడు, వ్యవసాయ శాఖ అధికారి జ్యోత్స్న, భవానీ, రైతులు పాల్గొన్నారు.

# ఏదడిగినా కేసీఆర్ కాదనలేదు..

- నీటిపారుదల విషయంలో ప్రతి ప్రయోగం ఇక్కడి నుంచే మొదలు
- మోతె గ్రామస్తుల ఉద్యమ స్ఫూర్తి అజరామరం
- ఈ స్ఫూర్తితోనే రాష్ట్రంలోనే మొదటి జిల్లాప్రజా పరిషత్ గెలుపు..
- మరింత స్పీడందుకున్న ఉద్యమం
- స్వరాష్ట్రం సాకారమయ్యాక, సీఎం హోదాలో మోతెకు వచ్చి వరాలు కురిపించిన కేసీఆర్
- రజతోత్సవ సభ నేపథ్యంలో వేముల ప్రశాంత్‌రెడ్డితో 'సాక్షి' ఇంటర్వ్యూ




సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: అభివృద్ధి పనుల విషయంలో ఏదడిగినా కేసీఆర్ కాదనలేదని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. స్వరాష్ట్ర ఉద్యమంలో తిరుగులేని స్ఫూర్తి రగిలించిన మోతె గ్రామం.. అభివృద్ధి విషయంలోనూ అంతే స్ఫూర్తి రగిలించిందన్నారు. బీఆర్ఎస్ రజతోత్సవం నేపథ్యంలో 'సాక్షి' ఇంటర్వ్యూలో ప్రశాంత్‌రెడ్డి పలు విషయాలను గుర్తుచేసుకున్నారు. ఈ వివరాలు ఆయన మాటల్లోనే..

**బీఆర్ఎస్‌కు అండగా గ్రామాలు**

తీవ్రమైన కరువు సమస్యను ఎదుర్కొంటున్న వేల్పూర్ మండలంలోని మోతె గ్రామస్తులు తమ సమస్యలు పరిష్కారం కావాలంటే స్వరాష్ట్రం సాధించుకోవాల్సిందేనని నిశ్చయించుకున్నారు. 2001లో కేసీఆర్ బీఆర్ఎస్ ఏర్పాటు చేశాక ఏకగ్రీవ తీర్మానం చేసుకుని మోతె గ్రామస్తులు పార్టీ వైపు నిలబడ్డారు. ఇదే స్ఫూర్తితో మెండోరా మండలంలోని బుస్సాపూర్ గ్రామస్తులు తీర్మానం చేసుకుని బీఆర్ఎస్‌కు జైకొట్టారు. తరువాత రాష్ట్రవ్యాప్తంగా వరుసగా అనేక గ్రామాల్లో బీఆర్ఎస్‌కు మద్దతు పెరిగింది.

**మోతె నుంచే జెడ్పీటీసీ అభ్యర్థి**

పార్టీ ఆవిర్భవించిన కొన్ని నెలలకే ప్రజాపరిషత్ ఎన్నికలు వచ్చాయి. వేల్పూర్ మండలానికి సంబంధించి మోతె గ్రామస్తులు చెప్పిన వసంత్‌గౌడ్‌కే టిక్కెట్ ఇవ్వడం జరిగింది. మోతె స్ఫూర్తితో ఉమ్మడి జిల్లా ప్రజాపరిషత్‌ను బీఆర్ఎస్ సొంతంగా గెలుచుకుంది. ఈ గెలుపుతో ఉద్యమ పార్టీగా అనేక అడుగులు వేసింది. సబ్బండ వర్గాలు ఉద్యమంలో కలిసివచ్చాయి. రాష్ట్రం కల సాకారమైంది.

**మా తండ్రి ఆశయాలను కొనసాగిస్తున్నా..**

స్వరాష్ట్రం వస్తేనే అనుకున్నవిధంగా అభివృద్ధి సాధ్యమని, గ్రామాలు స్వయం సమృద్ధి సాధించాలంటే చిన్ననీటి వనరులను పెపొందించుకోవాలని మా తండ్రి వేముల సురేందర్‌రెడ్డి చెప్పేవారు. ఆయన ఉద్యమ పార్టీ వ్యవస్థాపక సభ్యుడిగా, రాష్ట్ర రైతు విభాగం అధ్యక్షుడిగా చనిపోయేవరకు సేవలందించారు. ఆయన స్ఫూర్తిని కొనసాగిస్తున్నా.

**నీటిపారుదల ప్రయోగాలు ఇక్కడి నుంచే మొదలు**

నీటిపారుదల విషయంలో చెక్‌డ్యాముల నుంచి మొదలు అనేక చిన్న, పెద్ద తరహా నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించి ప్రతి ప్రయోగం ఇక్కడే చేశాం. ఇక్కడ సక్సెస్ చేశాక, కేసీఆర్ రాష్ట్రంలో అన్ని ప్రాంతాల్లో అమలు చేశారు. ఎస్సారెస్పీ వరద కాలువకు కింది లెవెల్‌లో 16 తూములు ఏర్పాటు చేయడంతో 45 చెరువు లు నిండుతున్నాయి. కాళేశ్వరం ద్వారా ప్రతి రెండున్నర ఎకరాలకు ఒక అవుట్‌లెట్ పాయింట్ ఏర్పాటు చేశాం.

### జగన్‌మోహన్‌రెడ్డికి పైలట్‌గా..

కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి ఏపీ ముఖ్యమంత్రి హోదాలో జగన్‌మోహన్‌రెడ్డి వచ్చినప్పుడు ఆయనను రిసీవ్ చేసుకుని పైలట్‌గా వ్యవహరించే బాధ్యతను కేసీఆర్ నాకు అప్పగించారు. దీన్ని ఎప్పటికీ మరిచిపోలేను.

### మోతె మట్టితో ముడుపు కట్టిన కేసీఆర్

ఉద్యమ పార్టీ బీఆర్ఎస్‌కు మద్దతు ఇచ్చి స్ఫూర్తి రగిలించిన మోతె గ్రామానికి 2001 మే 5వ తేదీన కేసీఆర్ వచ్చి ఇక్కడి మట్టితో ముడుపు కట్టారు. 2014లో తెలంగాణ బిల్లు పార్లమెంట్‌లో పాసయ్యాక అదే ఏడాది మార్చి 28న కేసీఆర్ గ్రామానికి వచ్చి ముడుపు విప్పారు. తరువాత మళ్లీ ముఖ్యమంత్రి హోదాలో 2015 జూలై 6వ తేదీన ఇక్కడకు వచ్చి గ్రామంపై వరాలు కురిపించారు. గ్రామంలో చెరువు, మాటు కాలువ, పాఠశాల, ప్రత్యేకంగా పీహెచ్‌సీ, కొత్త గ్రామపంచాయతీ, రూ.2 కోట్లతో సీసీ రోడ్లు నిర్మాణమయ్యాయి. అప్పుడు వేల్పూర్‌లోని మా పెంకుటిల్లులోనే కేసీఆర్ బస చేశారు.

## క్లుప్తంగా

### హ్యాండ్‌బాల్‌ పోటీలకు క్రీడాకారుల ఎంపిక



మాక్లూర్‌: త్వరలో జరుగనున్న తెలంగాణ ఇంటర్‌ డిస్ట్రిక్‌ సీనియర్‌ ఉమెన్‌ హ్యాండ్‌బాల్‌ పోటీలకు శనివారం మండలంలోని కల్లెడి ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో క్రీడాకారుల ఎంపికలు నిర్వహించారు. ఈనెల 28, 29, 30 తేదీలలో ఆదిలాబాద్‌ జిల్లా మందమర్రిలో జరిగే రాష్ట్రస్థాయి సీనియర్‌ ఉమెన్‌ హ్యాండ్‌బాల్‌ పోటీల్లో పాల్గొనేందుకై క్రీడాకారులను వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎంపిక చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 50 మంది క్రీడాకారులు పాల్గొనగా ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను ఎంపిక చేశారు. నిజామాబాద్‌ జిల్లా హ్యాండ్‌బాల్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు గంగామోహన్‌, ప్రధాన కార్యదర్శి పింజ సురేందర్‌, సభ్యులు బాబురావు, పీడీ రమణ, పీఈటీలు సౌజన్య, సంజీవ్‌ పాల్గొన్నారు.

### విద్యుత్‌ వినియోగదారుల కోసం 'వాట్సాప్‌ చాట్‌బాట్‌'

సుభాష్‌నగర్‌: విద్యుత్‌ వినియోగదారులకు మరింత ఉత్తమ సేవలు అందించడంలో భాగంగా 1912 టోల్‌ఫ్రీ నెంబర్‌తోపాటుగా కొత్త ఫీచర్‌ 'వాట్సాప్‌ చాట్‌ బాట్‌'ను అందుబాటులోకి తీసుకొచ్చామని ఎన్పీడీసీఎల్‌ సర్కిల్‌ సూపరింటెండెంట్‌ ఇంజినీర్‌ (ఎస్‌ఈ) రవీందర్‌ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు తమ మొబైల్‌ నుంచి వాట్సాప్‌లో 79016 28348 నెంబర్‌కు హాయ్‌ అని చాట్‌ చేయగానే హాయ్‌ టీజీఎన్పీడీసీఎల్‌ కాల్‌ సెంటర్‌కు స్వాగతం అని రిప్లై వచ్చి రిజిస్టర్‌ కంప్లయింట్‌, ట్రాక్‌ కంప్లయింట్‌, చాట్‌ విత్‌ ఏజెంట్‌ అని వస్తుందన్నారు. వినియోగదారులు కావాల్సిన ఆప్షన్‌ను ఎంచుకొని సమస్యలను తెలుపవచ్చన్నారు. అలాగే www.tgnpdcl.com వెబ్‌ సైట్‌లో వాట్సాప్‌ ఐకాన్‌ కనిపిస్తుందని, ఆ ఐకాన్‌ క్లిక్క్‌ చేసుకొని చాట్‌ చేయవచ్చన్నారు.

### 70 దరఖాస్తులు

ఖలీల్‌వాడి: నిజామాబాద్‌ ఎక్సైజ్‌లో బార్లకు దరఖాస్తుల స్వీకరణ శనివారం ముగిసినట్లు ఎక్సైజ్‌ సూపరింటెండెంట్‌ మల్లారెడ్డి తెలిపారు. మున్సిపల్‌ కార్పొరేషన్‌లోని మూడు బార్లకు 56 దరఖాస్తులు రాగా ఆర్మూర్‌లోని ఒక బార్‌కు 14 దరఖాస్తులు మొత్తం 70 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఈ దరఖాస్తులను కలెక్టర్‌ సమక్షమంలో లక్కీడ్రా తీయబడుతుందని తెలిపారు.

# ఖరీఫ్‌ ప్రణాళిక ఖరారు

- విడుదల చేసిన వ్యవసాయ శాఖ
- జిల్లావ్యాప్తంగా 5.21లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతాయని అంచనా



డొంకేశ్వర్‌(ఆర్మూర్‌): 2025–26 వానకాలం (ఖరీఫ్‌) సీజన్‌కు సంబంధించిన పంటల ప్రణాళిక ఖరారైంది. జిల్లా వ్యాప్తంగా 5.21లక్షల ఎకరాలకు పైగా పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇందులో అత్యధికంగా వరి 4.32లక్షల ఎకరాల్లో సాగయ్యే అవకాశమున్నట్లు పేర్కొంది. అయితే గతేడాది ఖరీఫ్‌తో పోలిస్తే ఈసారి కొంతమేర సాగు విస్తీర్ణం పెరగనుంది. తొలకరి చినుకులు పడగానే రైతులు జూన్‌ మొదటి వారం నుంచి సాగు పనులు ప్రారంభించనున్నారు. వరి తర్వాత సోయాబీన్‌, మొక్కజొన్న, పసుపు పంటలు ఎక్కువగా సాగు చేసేందుకు రైతులు మొగ్గు చూపే అవకాశముంది.

**విత్తనాలు, ఎరువులు..**

ఖరీఫ్‌ పంటలకు అవసరమయ్యే విత్తనాలు, ఎరువులకు కూడా వ్యవసాయ శాఖ ప్రణాళిక తయారు చేసింది. వరికి 1.30లక్షల క్వింటాళ్లు, మొక్కజొన్నకు 3,400 క్వింటాళ్ల విత్తనాలు అవసరం కానున్నట్లు అంచనా వేసింది. అలాగే సోయాబీన్‌కు 15,500 క్వింటాళ్లు, పెసర 10 క్వింటాళ్లు, కంది 58 క్వింటాళ్లు, మినుములు 15 క్వింటాళ్లు, పత్తి 6,546 క్వింటాళ్లు, అలాగే పచ్చిరొట్ట విత్తనాలు 18వేల క్వింటాళ్ల అవసరం అవుతాయని వ్యవసాయ శాఖ ప్రతిపాదనలు తయారు చేసింది. అదే విధంగా ఎరువుల విషయానికి వస్తే జిల్లాకు యూరియా 75వేల మెట్రిక్‌ టన్నులు, డీఏపీ 13,070, ఎంవోపీ 13,105, కాంప్లెక్స్‌ 44,480 మెట్రిక్‌ టన్నులు, ఎస్‌ఎస్‌పీ 1,452 మెట్రిక్‌ టన్నులు అవసరమయ్యే అవకాశం ఉన్నట్లు వ్యవసాయ శాఖ అంచనా వేసింది.

**ఖరీఫ్‌ అంచనా ప్రణాళిక**

| పంట | ఎకరాలు |
|---|---|
| వరి | 4,32,635 |
| మొక్కజొన్న | 47,678 |
| సోయాబీన్‌ | 37,859 |
| పత్తి | 1,332 |
| కంది | 855 |
| పసుపు | 19,735 |
| వేరు శనగ | 514 |
| ఇతర పంటలు | 3,560 |

**రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం..**

ఖరీఫ్‌ సాగు అంచనా ప్రతిపాదనలు తయారు చేశాం. విత్తనాలు, ఎరువుల సరఫరా విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూస్తాం. ముఖ్యంగా ఎరువుల కొరత రానివ్వకుండా ఎప్పటికప్పుడు జిల్లాకు తెప్పిస్తాం. ఇప్పటికే జిల్లాలో కొంత బఫర్‌ స్టాక్‌ ఉంది. రైతులు ఏఈవోలను సంప్రదించి పంటల సాగులో సలహాలు, సూచనలు తీసుకోవాలి.

–వాజీద్‌ హుస్సేన్‌, జిల్లా వ్యవసాయాధికారి

# నూతన కార్యవర్గం ఎన్నిక



మాల మహానాడు జిల్లా నూతన కార్యవర్గం

నిజామాబాద్‌నాగారం: జిల్లాకేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో శనివారం నిజామాబాద్‌ జిల్లా మాలమహానాడు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా సభ్యుల సమక్షంలో ఎన్నుకున్నారు. రాష్ట్ర వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ ఎడ్ల నాగరాజ్‌, టీజీవో జిల్లా అధ్యక్షుడు అలుక కిషన్‌, కామారెడ్డి ఎస్సీ కార్పొరేషన్‌ ఈడీ తీట్ల దయానంద్‌, ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు స్వామిదాస్‌, జిల్లా తాజా మాజీ అధ్యక్షుడు ఆనంపల్లి ఎల్లయ్య సమక్షంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా నూతన అధ్యక్షుడిగా చొక్కం దేవీదాస్‌, ప్రధాన కార్యదర్శిగా నాంది వినయ్‌ కుమార్‌, కోశాధికారిగా రాజన్న, ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్‌, ఆసది గంగాధర్‌, మీర్జాపూర్‌ సాయన్న, కోటేశ్వర రావు, భోజన్న, సహాయ కార్యదర్శులుగా మక్కం గంగాధర్‌, రవీంద్రబాబు, నీరడి గంగాధర్‌, గంట చిన్నయ్య, సూర పోశెట్టి, బాలస్వామి, ఆర్గనైజింగ్‌ కార్యదర్శిలుగా అల్జాపూర్‌ నాగరావు, మోహన్‌ , సాంస్కృతిక కార్యదర్శిగా శ్రీనివాస్‌, పబ్లిసిటీ కార్యదర్శిగా దయానంద్‌ సాంకాంబ్లే, సభ్యులుగా గోపు మురళి, సుద్దులం సాయిలు, సల్ల బాలయ్య, బాలరాజు, బుచ్చన్న, పెద్ద బోర్గం మోహన్‌,రామచంద్రపల్లె ప్రభాకర్‌, వెంకటేష్‌, ఇప్ప సాయిలు, అలాగే సలహాదారులుగా అలుక కిషన్‌, దయానంద్‌, దండు చంద్రశేఖర్‌, దండు రాజేంద్ర ప్రసాద్‌, స్వామి దాస్‌, గోపు ప్రభాకర్‌, శ్రీనివాస్‌ ఎన్నికయ్యారు.

### చల్లబడిన వాతావరణం

నిజామాబాద్‌అర్బన్‌: జిల్లాలో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. జిల్లా కేంద్రంతో పాటు పలు మండలల్లో శనివారం రాత్రి విపరీతమైన గాలులు వీచాయి. అనంతరం ఉరుములు మెరుపులతో కూడిన వర్షం పడింది. గత వారం రోజులుగా ఎండల తీవ్రతకు ప్రజలు బయటకు వచ్చేందుకే వణికిపోయారు. కానీ వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు చోటుచేసుకొని గాలివాన రావడంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. ప్రస్తుతం జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు సాగుతున్నాయి. ఈక్రమంలో రోడ్లపై, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు ఉండటంతో వర్షం కారణంగా రైతులు ఇబ్బందులు పడ్డారు.

### నేడు ఆర్య సమాజ్‌ స్వర్ణోత్సవాలు

కామారెడ్డి అర్బన్‌: కామారెడ్డి ఆర్య సమాజ్‌ను ప్రారంభించి 50 ఏళ్లవుతున్న సందర్భంగా ఆదివారం స్వర్ణోత్సవాలను నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం 7 గంటల నుంచి జిల్లాకేంద్రంలోని శ్రీసరస్వతి విద్యామందిర్‌ హైస్కూల్‌లో స్వర్ణోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆర్య సమాజ్‌ పట్టణ అధ్యక్షుడు కిషన్‌, ప్రతినిధులు అరుణ, శ్రీనివాస్‌ ఒక ప్రకటనలో తెలిపారు.

# గ్రామసభల నిర్వహణలో కార్యదర్శులే కీలకం



శిక్షణనిస్తున్న రిసోర్స్‌పర్సన్‌ గోపాలకృష్ణ



శిక్షణ పూర్తి చేసుకున్న పంచాయతీ కార్యదర్శులతో డీపీవో, రిసోర్స్‌పర్సన్లు..

- డీపీవో శ్రీనివాస్‌రావు
- పంచాయతీ కార్యదర్శులకు ముగిసిన శిక్షణ

సుభాష్‌నగర్‌: జిల్లాలోని పౌర సమాజ సంస్థల సమన్వయంతో గ్రామసభలను బలోపేతం చేయాలని, సభల నిర్వహణలో పంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకమని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు. స.హ చట్టం, గ్రామసభ నిర్వహణ, కేంద్ర పంచాయతీరాజ్‌, గ్రామీణాభివృద్ధి శాఖ భాగస్వామ్యం తదితర అంశాలపై నగరంలోని ప్రాంతీయ శిక్షణా కేంద్రం(టీఎస్‌జీవో)లో డాక్టర్‌ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ పంచాయతీ కార్యదర్శులకు రెండ్రోజుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించింది. శనివారం ముగింపు సమావేశానికి డీపీవో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ పంచాయతీరాజ్‌ చట్టం–2018, మహిళా సాధికారత, బాలల సంరక్షణ చట్టాలు వంటి అంశాలపై శిక్షణనిచ్చామన్నారు. పంచాయతీ కార్యదర్శులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు, సవాళ్లపై చర్చించారు. రిసోర్స్‌ పర్సన్‌ గోపాలకృష్ణ, శ్రీనివాస్‌రావు, ఎంపీడీవో రాంనారాయణ, ఎంపీవో రామకృష్ణ, 30 మంది పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# నిలువ చేస్తే నిరాశే మిగిలింది



ఆరబోసిన ఎర్రజొన్నలు(ఫైల్‌)

- తగ్గిన ఎర్రజొన్నల ధర
- ఆవేదనలో అన్నదాత

మోర్తాడ్‌(బాల్కొండ): నిలువ చేసిన పంటను సీజన్‌ ముగిసిన తర్వాత విక్రయించుకుందామనుకున్న ఎర్రజొన్న రైతులకు నిరాశే మిగిలింది. గత సీజన్‌లో ఎర్రజొన్న క్వింటాల్‌కు రూ.3,800 ధర లభించడంతో మోర్తాడ్‌కు చెందిన మహిపాల్‌ అనే రైతు 40 క్వింటాళ్ల ఎర్రజొన్నలను నిలువ చేసుకున్నాడు. సీజన్‌ ముగిసిన తర్వాత కనీసం రూ.4,200 ధర లభిస్తుందని ఆశించాడు. కానీ, విత్తన వ్యాపారుల సిండికేట్‌తో సీజన్‌ ముగిసినా ధర ఏమాత్రం పెరగకపోగా కనీసం సీజన్‌లో లభించిన ధర కూడా దక్కలేదు. దీంతో వారం కింద క్వింటాల్‌కు రూ.400 తక్కువకు పంటను విక్రయించాడు. సుమారు రూ.16 వేల నష్టానికే మహిపాల్‌ తన పంటను విక్రయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మహిపాల్‌ మాదిరిగానే ఎర్రజొన్నలను నిలువ చేసుకున్న రైతులందరూ తక్కువ ధరకే తమ పంటను విక్రయించారు. రైతుల వద్ద దాదాపు 5వేల క్వింటాళ్ల ఎర్రజొన్నలు నిలువ ఉండగా ఒక్కో క్వింటాలుకు రూ.3,400 ధర ప్రకారం విక్రయించడంతో రూ.20 లక్షల వరకు లాభాన్ని కోల్పోయారు. గతంలో క్వింటాలుకు రూ.4,500 వరకు పలకగా, సీడ్‌ వ్యాపారుల గుత్తాధిపత్యంతో ధర పడిపోయి రైతులకు తీరని నష్టం మిగిల్చింది.

# జిల్లా జడ్జిని కలిసిన ఆర్మూర్‌ న్యాయవాదులు

ఆర్మూర్‌ టౌన్‌: నిజామాబాద్‌ జిల్లా ప్రధాన న్యాయమూర్తి భరతలక్ష్మిని శనివారం ఆర్మూర్‌ బార్‌ అసోసియేషన్‌ న్యాయవాదులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆర్మూర్‌ న్యాయస్థానాన్ని సందర్శించాలని ఈ సందర్భంగా న్యాయవాదులు ఆమెను కోరారు. ఆర్మూర్‌ బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు జక్కుల శ్రీధర్‌, ప్రధాన కార్యదర్శి జెస్సు అనిల్‌, ఉపాధ్యక్షుడు గడటి ఆనంద్‌, మద్దుల గంగారాం, చైతన్య, నరేందర్‌, చరణ్‌ ఉన్నారు.



జడ్జికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న న్యాయవాదులు

# కుక్కల దాడిలో 20గొర్రెలు మృత్యువాత



ఎల్లారెడ్డిరూరల్‌: మండలంలోని మల్లయ్యపల్లి గ్రామంలో కుక్కలు దాడి చేయడంతో 20 గొర్రెలు మృత్యువాత పడినట్లు గ్రామస్తులు శనివారం తెలిపారు. గ్రామంలోని కుర్మ మహేందర్‌కు చెందిన గొర్రెలపై కుక్కలు అకస్మాత్తుగా దాడి చేయడంతో 20 గొర్రెలు మృతి చెందాయని అన్నారు. మృతి చెందిన గొర్రెలను వెటర్నరీ వైద్యురాలు అర్చన పరిశీలించారు. ప్రభుత్వం నష్ట పరిహారం అందించేలా చూడాలని బాధితుడు కోరుతున్నారు. ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం అందేలా ఎమ్మెల్యే మదన్‌మోహన్‌ చర్యలు తీసుకుంటారని మండల పార్టీ అధ్యక్షుడు సాయిబాబా బాధితుడికి హామీ ఇచ్చారు.

### విద్యుత్‌ షాక్‌తో గేదె..



రుద్రూర్‌: మండలంలోని రాణంపల్లి శివారులో విద్యుత్‌ షాక్‌ తగిలి పాడి గేదె మృతి చెందింది. గ్రామానికి చెందిన శ్రీనివాస్‌ గేదెల పెంపకం ప్రధాన వృత్తిగా జీవనాన్ని కొనసాగిస్తున్నాడు. శనివారం గేదెలను మేత కోసం గ్రామ శివారులోకి తీసుకెళ్లగా ఒక గేదె ట్రాన్స్‌ఫార్మర్‌ వద్ద విద్యుత్‌ షాక్‌కు గురై మృతి చెందింది. మృతి చెందిన గేదె రూ.లక్షా 25వేల వరకు ఉంటుందని, నష్ట పరిహారం ఇప్పించాల్సిందిగా బాధిత రైతు కోరాడు.

### మహిళ అదృశ్యం

రుద్రూర్‌: కోటగిరి మండలం వల్లాభాపూర్‌ గ్రామానికి చెందిన మేకల లక్ష్మి అదృశ్యమైనట్లు ఎస్సై సునీల్‌ శనివారం తెలిపారు. ఈ నెల 17న ఇంట్లోంచి వెళ్లిన లక్ష్మి ఇప్పటి వరకు తిరిగి రాలేదు.బంధువులు,స్నేహితుల వద్ద వెతికినప్పటికీ ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె భర్త శివరాములు శనివారం పోలీస్‌స్టేషన్‌ ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### ఇసుక టిప్పర్లు సీజ్‌



నిజాంసాగర్‌(జుక్కల్‌): కర్ణాటక రాష్ట్రానికి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న రెండు టిప్పర్లను శనివారం సీజ్‌ చేసినట్లు డోంగ్లి మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ సాయిబాబా తెలిపారు. డోంగ్లి మండలంలోని మంజీరా వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తుండటంతో పట్టుకున్నామన్నారు.



## క్రైం కార్నర్‌

### చేపలవేటకు వెళ్లి ఒకరి మృతి

కామారెడ్డి క్రైం: చేపల వేటకు వెళ్లిన ఒకరు ప్రమాదవశాత్తు వాగులో పడి మృతి చెందిన ఘటన కామారెడ్డి మున్సిపల్‌ పరిధిలోని అడ్లూర్‌ గ్రామంలో వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. అడ్లూర్‌ గ్రామానికి చెందిన తోకల భాస్కర్‌ (38) చేపలు పట్టుకుని, అమ్ముకుంటూ జీవనం సాగించేవాడు. అతడు గురువారం సాయంత్రం గ్రామ శివారులోని వాగులో చేపలు పట్టడానికి వల వేసి ఇంటికి వచ్చాడు. శుక్రవారం ఉదయం చేపలు పడ్డాయా లేదా అని చూడటానికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు నీట మునిగి చనిపోయాడు. స్థానికుల సమాచారం మేరకు దేవునిపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ జరిపారు. మృతుడి కుమారుడు బన్ని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు.

**బస్సు ఢీకొని ఒకరు..**



నిజాంసాగర్‌: జుక్కల్‌ మండలంలోని మహమ్మదాబాద్‌ శివారులో శనివారం సాయంత్రం కర్ణాటక ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరు మృతిచెందారు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. కౌలాస్‌ గ్రామానికి చెందిన భగవాన్‌ జావిద్‌ (48) అనే రైతు శనివారం కూరగాయలను తీసుకొని మోపెడ్‌పై జుక్కల్‌కు బయలుదేరాడు. మహమ్మదాబాద్‌ శివారులో అతడిని ఔరాద్‌ నుంచి బిచ్కుంద వెళుతున్న కర్ణాటక బస్సు ఢీకొట్టింది. అనంతరం బస్సు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో అతడు తీవ్రంగా గాయపడగా స్థానికులు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు జుక్కల్‌ ఎస్సై భువనేశ్వర్‌ తెలిపారు.

**నగరంలో గుర్తుతెలియని వ్యక్తి..**

ఖలీల్‌వాడి: నగరంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి ఒక ప్రకటనలో తెలిపారు. జీజీహెచ్‌లోని రేకుల షెడ్డు వద్ద శనివారం మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడిఉండగా, సెక్యూరిటీ సిబ్బంది అతడిని హాస్పిటల్‌కు తరలించారు. అతడిని వైద్యులు పరీక్షించగా మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడు లేబర్‌ పని చేసుకునే వ్యక్తిగా కనపడుతున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుడు బ్లూ కలర్‌ షర్టు, బ్లాక్‌ కలర్‌ ప్యాంట్‌ ధరించినట్లు చెప్పారు. సుమారు 45నుంచి 50ఏళ్ల మధ్య వయస్సు ఉంటుందన్నారు. మృతుడి వద్ద ఆధార్‌ కార్డు లభించగా ఇందులో ఆర్మూర్‌ మండలం మామిడిపల్లి గ్రామం తెనాలి రవి ఉన్నట్లు చెప్పారు. గ్రామంలో విచారణ చేయగా ఇలాంటి వారు ఎవరు లేరని తెలిసింది, మృతుడికి సంబంధించిన సమాచారం కోసం ఒకటో టౌన్‌ పోలీసులను, 8712659714ను సంప్రదించాలని తెలిపారు.

### ప్రాణహాని ఉందని సీపీకి ఫిర్యాదు

ఎడపల్లి(బోధన్‌): తనకు, కుటుంబసభ్యులకు ప్రాణహాని ఉందని మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన సుండు సతీష్‌ శనివారం సీపీ సాయిచైతన్యకు ఫిర్యాదు చేశారు. తనపై కక్ష గట్టిన సుండు యాదగిరి, అరుణ్‌ కుమార్‌, సుండు నర్సయ్యలు తనను చంపడానికి యత్నిస్తున్నారని, వీరిపై చర్యలు తీసుకువాలని, తనకు కుటుంబసభ్యులకు రక్షణ కల్పించాలని కోరారు. ఇప్పటి వరకు తనపై తన ఇంటిపై రెండు సార్లు దాడి చేశారని, దాడులకు సంబంధించిన వీడియోలను ఎడపల్లి పోలీసులకు ఇచ్చి ఫిర్యాదు చేశానన్నారు. కానీ ఇప్పటి వరకు వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని సీపీ దృష్టికి తీసుకువచ్చినట్లు చెప్పారు.

### షార్ట్‌ సర్క్యూట్‌తో దుకాణం దగ్ధం



కామారెడ్డి టౌన్‌: జిల్లా కేంద్రంలోని గాంధీ గంజ్‌లో రైతుబజార్‌ పక్కనే ఉన్న బేకరి, ఎగ్‌ సెంటర్‌ రేకుల షెడ్‌ దుకాణంలో శుక్రవారం అర్ధరాత్రి విద్యుత్‌ షార్ట్‌ సర్క్యూట్‌ కారణంతో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. దీంతో దుకాణంలో మంటలు చెలరేగి సామగ్రి పూర్తిగా దగ్ధం అయింది. స్థానికుల సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. రూ.2లక్షలకు పైగా నష్టం జరిగిందని దుకాణం యజమాని ఆసిఫ్‌ తెలిపారు.

### బోల్తా పడిన ఆటో.. పలువురికి గాయాలు

ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్‌ మండలం గగ్గుపల్లి శివారులో శనివారం తెల్లవారు జమున ఆటో అదుపుతప్పి బోల్తా పడటంతో ఏడుగురికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. ఆలూర్‌ మండల కేంద్రానికి చెందిన ఏడుగురు మహిళలు ఉదయం ఆర్మూర్‌ మున్సిపల్‌ కార్యాలయంలో పని నిమిత్తం ఆటోలో బయలుదేరారు. గగ్గుపల్లి శివారులో ఆటోకు పంది అడ్డు రావడంతో దాన్ని తప్పించబోయి అదుపుతప్పి బోల్తాపడింది. ఈఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న వారికి స్వల్ప గాయాలు అయ్యాయి. స్థానికులు గమనించి వారిని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

### కరెంట్‌షాక్‌తో ఒకరికి ..

గాంధారి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని ఓ వ్యవసాయ బోరు వద్ద నీరు తాగేందుకు వెళ్లిన ఓ వ్యక్తికి ప్రమాదవశాత్తు కరెంటు షాక్‌ తగిలినట్లు ఎస్సై ఆంజనేయులు శనివారం తెలిపారు. వివరాలు ఇలా.. మండల పరిధిలోని పర్మళ్ల తండాకు చెందిన మాలావత్‌ సక్రాం మండలకేంద్రంలోని పెట్రోల్‌బంక్‌ సమీపంలో గల ఓ వ్యవసాయ బోరు వద్దకు నీరు తాగేందుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు కరెంట్‌ షాక్‌ తగిలి కింద పడిపోయాడు. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు అతడిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కామారెడ్డికి తరలించి ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించినట్లు తెలిపారు.

### తాళం వేసిన ఇంట్లో చోరీ

ఖలీల్‌వాడి: నగరంలోని పూలాంగ్‌ పాత బ్రిడ్జి వద్ద తాళం వేసిన ఓ ఇంట్లో చోరీ జరిగినట్లు ఎస్సై శ్రీకాంత్‌ తెలిపారు. వివరాలు ఇలా.. ఈనెల 23న ఇంటి యజమాని చిన్నయ్య ఇంటికి తాళం వేసి, కుటుంబసభ్యులతో కలిసి హైదరాబాద్‌కు వెళ్లారు. గుర్తుతెలియని దుండగులు శనివారం ఇంటి తాళం పగులగొట్టి, బీరువాను ధ్వంసం చేసి మూడు తు లాల బంగారం , రూ.50వేల నగదును ఎత్తుకెళ్లిన ట్లు చెప్పారు. దుండగుల అలజడికి పక్కింట్లోని వా రు నిద్రలే వగా వారు బైక్‌లపై పరారయ్యారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

**గాజుల్‌పేటలో..**

నగరంలోని గాజులపేట్‌ పోతలింగన్న గుడి వద్ద తాళం వేసిన ఓ ఇంట్లో చోరీ జరిగింది. కాలనీకి చెందిన నాగభూషణం(90) నెలరోజుల క్రితం ఇంటికి తాళం వేసి, ఊరికి వెళ్లారు. శనివారం వేకువజామున గుర్తుతెలియని దుండగులు ఇంటి తాళాలు పగులగొట్టి లోకిని ప్రవేశించారు. బీరువాను ధ్వంసం చేశారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఈ విషయమై ఎస్సై యాసీన్‌ఆరాఫత్‌ను వివరణ కోరగా బాధితుల నుంచి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

# రోడ్డు ప్రమాదం కాదు.. హత్యే..

- ఈనెల 3న జరిగిన సికింద్రాపూర్‌ యాక్సిడెంట్‌ కేసును ఛేదించిన పోలీసులు
- ముగ్గురు నిందితుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డిచ్‌పల్లి సీఐ మల్లేష్‌

జక్రాన్‌పల్లి: మండలంలోని సికింద్రాపూర్‌ 44వ నెంబర్‌ జాతీయ రహదారిపై ఈ నెల 3న ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో గాయపడగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మొదట యాక్సిడెంట్‌గా భావించగా, ఇటీవల హత్యగా పోలీసులు నిర్ధారించారు. జక్రాన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో శనివారం డిచ్‌పల్లి సీఐ మల్లేష్‌, ఎస్సై తిరుపతి నిందితుల వివరాలను వెల్లడించారు. డిచ్‌పల్లి మండలంలోని మెంట్రాజ్‌పల్లికి చెందిన బైరం రవీంద్రవర్మ (37) హైవేపై తలకు గాయాలై అనుమానస్పద స్థితిలో పడి ఉండగా జక్రాన్‌పల్లి పోలీసులు అతనిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై మొదటగా జక్రాన్‌పల్లి ఎస్సై తిరుపతి గుర్తు తెలియని వాహనం ఢీకొని రవీంద్ర వర్మ మృతి చెందాడని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. కానీ ఘటన స్థలంలో మృతుడి సెల్‌ఫోన్‌, బ్యాగ్‌ లభించకపోవడంతో ఆ దిశగా విచారణ చేపట్టారు. విచారణలో భాగంగా నిందితులు ఏ1 లక్ష్మీనర్సింలు, ఏ2 చింతల కృష్ణ, ఏ3 కడమంచి మారుతిని పట్టుకుని విచారించారు. వీరు ముగ్గురు కూడా బంధువులు. జల్సాలకు అలవాటు పడిన ముగ్గురు నిందితులు అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకుని పథకం ప్రకారం దారిదోపిడీలకు పాల్పడుతున్నారని తెలిపారు. అందులో భాగంగానే రవీంద్ర వర్మను ముగ్గురు నిందితులు లిఫ్ట్‌ ఇస్తామని తమ వాహనంపై ఎక్కించుకున్నారు. కొంతదూరం వెళ్లాక సికింద్రాపూర్‌ గ్రామ శివారులో వాహనాన్ని ఆపి పథకం ప్రకారం రవీంద్ర వర్మను భయపెట్టి, అతని వద్ద గల సెల్‌ఫోన్‌, బ్యాగ్‌, డబ్బులు దోచుకున్నారు. రవీంద్ర వర్మ ఎదురు తిరగడంతో వారు బండరాయితో మోదడంతో స్పృహ కోల్పోయి కిందపడిపోయాడు. నిందితులు అతడిని 44వ నెంబర్‌ జాతీయ రహదారిపై పడేసి ఏదో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టినట్లు చిత్రీకరించారు. మృతుడి సెల్‌ఫోన్‌ను కనుక్కోవడంతో అసలు విషయం బయటపడింది. దీంతో రవీంద్ర వర్మను హత్య చేసిన నిందితులను అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ, ఎస్సై తెలిపారు. నిందితుల వద్ద నుంచి సెల్‌ఫోన్‌లతో పాటు స్కూటీ, బ్యాగ్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితులను చాకచక్యంగా పట్టుకున్న జక్రాన్‌పల్లి ఎస్సై తిరుపతి, సిబ్బందిని సీఐ అభినందించారు.

### చోరీ కేసులో ముగ్గురి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

నవీపేట: మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన చోరీ కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. నిజామాబాద్‌ నార్త్‌రూరల్‌ పోలీస్‌ స్టేషన్‌ ఆవణలో శనివారం సీఐ శ్రీనివాస్‌ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ముప్కాల్‌ మండలంలోని కంజర్‌ గ్రామానికి చెందిన ముగ్గురు కూలీలు కాలూర్‌ లత, పంతుల విజయ, ఈర్ల సాయికుమార్‌ ప్రతిరోజు కలిసి కల్లు తాగేవారు. ఈక్రమంలో ఈజీగా డబ్బు సంపాదించాలనే ఆలోచనలో షేర్‌చాట్‌ను ఫాలో అయ్యారు. కత్తి, కారంతో ఒక మహిళను బెదిరించి.. బంగారం దొంగిలించిన వీడియో వీరికి నచ్చింది. అంతే శుక్రవారం నవీపేటలో వారాంతపు కూరగాయల సంత ఉండడంతో అమాయకుల కోసం గాలించారు. ఈ క్రమంలో మండలంలోని నారాయణ్‌పూర్‌కు చెందిన రాచర్ల కిష్టాబాయి అనే వృద్ధురాలు ఒంటరిగా వెళ్తుండగా ఆమెను వెంబడించారు. కత్తితో బెదిరించి.. కంట్లో కారం చల్లి..బంగారు పుస్తెల గుండ్లు, పడిగెలను దోచుకుని పారిపోయారు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో దొంగతనానికి పాల్పడిన ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు.

# తెలియక పురుగులమందు తాగిన బాలుడు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని నల్లమడుగు పెద్దతండాకు చెందిన శ్రీయాన్స్‌ (సంవత్సరంన్నర బాలుడు) శనివారం ఉదయం పురుగుల మందు తాగినట్లు తండా వాసులు తెలిపారు. బాలుడి తల్లిదండ్రులు రవీందర్‌, శాను ఉదయాన్నే ఉపాధి హామీ పనులకు వెళ్లారు. ఇటీవల పశువులకు కోసం తెచ్చిన మందును ఇంట్లో పెట్టారు. బాలుడు ఇంట్లో ఆడుకుంటూ పురుగుల మందు అని తెలియక తాగాడు. నురుగులు కక్కుతుండడంతో చుట్టు పక్కల వారు గమనించి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు.

అలాగే 108కు సమాచారం ఇవ్వగా వారు హుటాహుటిన కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడినుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. బాలుడు ఆరోగ్యంగా తిరిగి రావాలని తండా వాసులు ప్రార్థిస్తున్నారు.

IV
సాక్షి ఫ్యామిలీ
నిజామాబాద్
ఆదివారం ॥ 27-4-2025

● విజయ పథం





● సోలార్ పవర్‌తో జీవితాలలో కొత్త వెలుగు

# సోలార్ సఖి

**రైల్లో తొలిసారి ప్రయాణించిన ఆ మహిళలు.... 'రైలు ప్రయాణం ఇంత బాగుంటుందా!' అని సంబరపడి పోయారు. ఆ తరువాత మరో ప్రయాణం మొదలు పెట్టారు. అయితే అది రైలు ప్రయాణం కాదు. తమ జీవితాలను మార్చివేసిన ప్రయాణం. చిన్న చదువులు చదువుకున్న ఎంతో మంది గ్రామీణ మహిళలు సోలార్ ఇంజినీర్‌లుగా, ఎంటర్‌ప్రెన్యూర్స్‌గా రాణిస్తున్నారు...**



● సోలార్ సఖి: భవిష్యత్ తరానికి మార్గదర్శనం

రాజస్థాన్‌లో నిశ్చలగఢ్‌కు చెందిన తప్రీదేవి ఎన్నో సంవత్సరాలు విద్యుత్ సౌకర్యం లేని ఇంట్లోనే గడిపింది. అయిదవ తరగతి తరువాత తల్లిదండ్రులు చదువు మాన్పించడంతో ఇంటి పనులు చేసేది. గొర్రెలు మేపేది. ఇల్లే ప్రపంచంగా బతుకుతున్న తప్రీదేవి జీవితాన్ని 'సోలార్ పవర్' మార్చివేసింది. హర్మదా(జైపూర్)లో ఐదు నెలల సోలార్ ఇంజినీరింగ్ శిక్షణ కార్యక్రమం ఆమె జీవితాన్ని కొత్త దారిలోకి తీసుకువెళ్లింది.

సోలార్ ఇంజినీరింగ్ శిక్షణ కోసం సిద్ధం అయినప్పుడు..

'ఎందుకులే' అన్నారు తల్లిదండ్రులు. వారిని బలవంతంగా ఒప్పించాల్సి వచ్చింది,

'మా కమ్యూనిటీలోని మహిళలు ఎప్పుడూ ముసుగు లేకుండా ఒంటరిగా బయటకు వెళ్లలేదు. నేను ఎప్పుడూ పట్టణ ప్రాంతానికి ఒంటరిగా వెళ్లలేదు' అంటుంది తప్రీదేవి.

కిషన్‌గఢ్‌కు వెళ్లడం...తన తొలి రైలు ప్రయాణం! 'అది పూర్తిగా కొత్త అనుభవం. ప్రయాణంలోని ఆనందం తెలిసొచ్చింది' అంటుంది తప్రీదేవి.



● 'ఆది సేవా గౌరవ్ సమ్మాన్' అవార్డ్ అందుకున్న తప్రీదేవి

శిక్షణలో సోలార్ ఇన్‌స్టలేషన్, ఫీల్డ్‌వర్క్‌కు అవసరమైన నైపుణ్యాలు సంపాదించింది. ఆ తరువాత స్వగ్రామానికి తిరిగివచ్చింది. 'మేము చాలా సంవత్సరాలు చీకటిలో జీవించాము. అందుకే మా జీవితాల్లో వెలుగు తీసుకురావాలనుకున్నాను' అంటుంది తప్రీదేవి.

సోలార్ ఇంజినీర్‌గా కొత్త జీవితాన్ని ప్రారంభించిన తప్రీదేవి తన గ్రామానికి విద్యుత్ వెలుగులు తీసుకువచ్చింది. భారత రాష్ట్రపతి నుండి 'ఆది సేవా గౌరవ్ సమ్మాన్' అవార్డ్ అందుకుంది. ఇది కేవలం తప్రీదేవి విజయగాథ మాత్రమే కాదు... జార్ఖండ్, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్, మిజోరాం, నాగాలాండ్‌తో సహా పదిరాష్ట్రాలలో మూడువేల మందికి పైగా గ్రామీణ మహిళా సోలార్ ఇంజినీర్‌ల విజయగాథ.

తమ గ్రామాల్లో సోలార్ ప్యానెళ్లను ఒంటి చేత్తో మరమ్మతు చేసే వీరు పారిశ్రామికవేత్తలుగా కూడా ఎదిగారు. ఈ మార్పుకు కారణం హర్ష్ తివారీ నేతృత్వంలోని ఈఎంపీఐ ఇంటర్నేషనల్. ఈ సంస్థ శిక్షణ కార్యక్రమాల ద్వారా గ్రామీణ ప్రాంత మహిళలు సోల్డరింగ్, వైరింగ్, బ్యాటరీ సెటప్, ఫాల్ట్ ఫైండింగ్, ఇన్‌స్టలేషన్‌లలో ప్రావీణ్యం సాధించారు. గ్రామీణ మహిళలకు సాంకేతిక నైపుణ్యం, ఆర్థికస్వాతంత్ర్యం లక్ష్యంగా ఈఎంపీఐ ఇంటర్నేషనల్ పనిచేస్తోంది.

శిక్షణ అనంతరం మహిళలు తమ గ్రామాల్లో సోలార్ సొల్యూషన్స్ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేస్తారు. మరమ్మతులు, ఫస్ట్‌లెవల్ చెకప్‌లు నిర్వహించేందుకు వీలుగా చిన్న ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తారు. గ్రామస్థాయి ఇంధన మౌలిక సదుపాయాలు సజావుగా సాగేలా చూస్తారు. శిక్షణ పూర్తయిన తరువాత క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న మహిళా సోలార్ ఇంజినీర్‌లను 'సోలార్ సఖీ' అని పిలుస్తారు.

'వ్యవసాయంతో పాటు చిన్న తరహా పరిశ్రమలలో సౌరశక్తితో నడిచే పరికరాలకు డిమాండ్ పెరుగుతుంది, దీన్ని దృష్టిలో పెట్టుకొని ఈఎంపీఐ ఇంటర్నేషనల్ సోలార్ సఖీలకు శిక్షణ ఇస్తోంది. జీవనోపాధి కల్పిస్తుంది. టెక్నికల్ ట్రైనింగ్‌తోపాటు ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, కస్టమర్ ఎంగేజ్‌మెంట్‌లో కూడా శిక్షణ ఇస్తాం. గ్రామాల్లో సోలార్ సెటప్‌లలో ఏవైనా సాంకేతిక లోపాలు తలెత్తితే సోలార్ సఖులు పరిష్కారం చూపుతున్నారు' అంటున్నాడు హర్ష్ తివారీ.

కూల్ సమ్మర్

# పక్షులను చల్లగా కాపాడుకుందాం!

**వేసవి కాలం పక్షులకు కష్టకాలం. అధిక వేడి పక్షులకు ప్రమాదకరంగా మారుతుంది. డీహైడ్రేషన్, వడదెబ్బ బారిన పడకుండా పక్షులను రక్షించడానికి... నీరు, నీడ, గాలి ప్రసరణకు ప్రాముఖ్యత ఇవ్వాలి. కొన్ని జాగ్రత్తలు...**





● పక్షులకు అన్ని వేళలా శుభ్రమైన మంచినీరు అందుబాటులో పెట్టాలి ● వేర్వేరు ప్రదేశాలలో వాటర్ బౌల్స్ పెట్టాలి ● చల్లగా, ఫ్రెష్‌గా ఉండడానికి వాటర్ బౌల్స్‌లో ఐస్ క్యూబ్స్ వేయవచ్చు ● చల్లని, సౌకర్యవంతమైన స్థలంలో పక్షులు ఉండేలా చూడాలి ● కూలింగ్ మ్యాట్స్ ఉపయోగించవచ్చు ● పక్షులపై ఒక నిమిషం లేదా అర నిమిషం నీటిని స్ప్రే చేయాలి ● పక్షులకు సమీపంలో తడి టవల్స్ ఏర్పాటు చేయాలి ●వేగంగా శ్వాస తీసుకోవడం, ఉక్కిరిబిక్కిరి కావడం, బద్ధకంగా కనిపించడం, తినడానికి ఆసక్తి చూపించకపోవడం...మొదలైనవి పక్షులకు సంబంధించి ఓవర్ హీటింగ్ లక్షణాలు. ఈ లక్షణాలు కనిపించిన వెంటనే తక్షణ జాగ్రత్తలు తీసుకోవాలి ● ఆహారం విషయానికి వస్తే.... నీటి శాతం ఎక్కువగా ఉన్న పుచ్చకాయ, దోసకాయలాంటివి అందించవచ్చు ● ఉత్తర్‌ప్రదేశ్‌లోని కొన్ని జిల్లాలలో వందలాది గ్రామాల్లో యానిమల్ యాక్టివిస్ట్‌లు వేసవి వేడి నుంచి పక్షులను కాపాడడానికి 'బర్డ్ రెస్టారెంట్స్' ఏర్పాటు చేశారు. పక్షులకు చల్లని నీడను ఇచ్చేలా నీరు, ఆహార పదార్థాలతో చెట్టు కొమ్మలపై ఈ రెస్టారెంట్‌లు ఏర్పాటు చేశారు.





● మానవత్వం

# నిరీక్షణ ఫలించింది...



కొన్ని సంవత్సరాల నుంచి భర్తతో కలిసి మన దేశంలో ఉంటున్న క్రిస్టెన్ ఫిషర్ అనే అమెరికన్ భారత్‌లో తన అనుభవాలను ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో షేర్ చేస్తుంటుంది. దిల్లీలో ఉంటున్న ఫిషర్ దంపతులు నిషా అనే దివ్యాంగురాలైన బాలికను దత్తత తీసుకోవాలనుకున్నారు. అయితే దత్తత ప్రక్రియ సుదీర్ఘంగా కొనసాగింది.

'2023లో అక్టోబర్‌లో దత్తత కోసం దరఖాస్తు చేసుకోగా, 2024లో నిషాకు దగ్గరయ్యాం. 2025 ఏప్రిల్ నాటికి దత్తత పూర్తయింది. ఇప్పుడు నిషా మా అందమైన కుమార్తె' అని ఇన్‌స్టాగ్రామ్‌లో రాసింది ఫిషర్.

'కౌంటింగ్ డౌన్ ది డేస్ అన్‌టిల్...' ట్యాగ్‌లైన్‌తో ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియో పోస్ట్ చేసింది. ఈ వీడియోలో తాను దత్తత తీసుకున్న పాప కనిపిస్తుంది.

మరో వీడియోలో చిన్నారి నిషాకు సంబంధించిన ఎమోషనల్ గ్లింప్స్‌ను షేర్ చేసింది. దివ్యాంగురాలు అనే కారణంతో నిషాను చిన్న వయసులోనే తల్లిదండ్రులు వదిలేశారు. రెండు సంవత్సరాలు అనాథాశ్రమంలో పెరిగింది నిషా. 'స్పెషల్ నీడ్స్ చైల్డ్‌ను దత్తత తీసుకోవాలనుకోవడానికి కారణం...వారికి కొత్త జీవితం ఇవ్వాలనుకోవడం' అంటుంది క్రిస్టెన్ ఫిషర్.

● గుడ్ అండ్ బ్యాడ్

# కిడ్‌ఫ్లూయెన్సర్... కిం కర్తవ్యం



యూ ట్యూబ్‌లో కిడ్‌ఫ్లూయెన్సర్‌ల వైరల్ వీడియోలు ప్రవాహంలా కనిపిస్తాయి. క్యాచీ కంటెంట్‌తో లక్షల్లో వ్యూస్ సాధిస్తున్నారు. లక్షల్లో సబ్‌స్క్రైబర్‌లు ఉన్నారు. మన దేశంలో కిడ్‌ఫ్లూయెన్సర్‌ల సంఖ్య అంతకంతకూ పెరిగిపోతుంది. అయితే దీనిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

తెర వెనుక కథ గురించి చర్చ మొదలైంది. షూటింగ్‌ల కోసం వారు తరచుగా స్కూల్‌కు వెళ్లకుండా ఎక్కువ సెలవులు పెడుతున్నారా? సరిగా తింటున్నారా? తగినంత నిద్ర ఉంటోందా? కంటెంట్‌కు సంబంధించి ఒత్తిడికి గురవుతున్నారా? అందరు పిల్లల్లా సాధారణ జీవితాన్ని ఎంజాయ్ చేయలేకపోతున్నారా... ఇలాంటి సందేహాలు ఎన్నో ఉన్నాయి.

బాగా చదివే పిల్లలు కూడా 'కిడ్‌ఫ్లూయెన్సర్' ట్యాగ్‌లైన్ పుణ్యమా అని చదువులో వెనకబడిపోతున్నారు. 'నేను చాలా సాధించాను. నేను చాలా గ్రేట్' అనే భావన పెరిగిపోతుంది. 'యాభై ఏళ్ల క్రితం అకాడమిక్ ఎక్స్‌లెన్స్ గోల్డ్ స్టాండర్డ్, ముప్పై ఏళ్ల క్రితం ఆటలు ఉండేవి. ఇప్పుడు క్రియేటివిటీ, డ్యాన్స్, మ్యూజిక్, విజువల్ కంటెంట్. ఒక్క వైరల్ వీడియో చాలు పిల్లలకు రాత్రికి రాత్రి స్టార్‌డమ్ తీసుకురావడానికి. ఈ తక్షణ పాపులారిటీ వల్లే పిల్లలు, తల్లిదండ్రులు వైరల్ కంటెంట్‌పై దృష్టి పెడుతున్నారు' అంటుంది కౌన్సెలింగ్ సైకాలజిస్ట్ డా.మేఘా పుష్కర్ణ.

## హెల్త్

● టూత్

### ఇంటి పట్టున ఉంటారు

# పంటి పని పట్టండి...... జంకొద్దు



**పిల్లలు ఎదుగుతూ ఉండే సమయంలో అన్ని ఎముకలతో పాటు ముఖానికి సంబంధించిన ఎముకలూ, దవడ ఎముకల్లోనూ మార్పులు వస్తుంటాయి. దాంతో చిన్నారుల్లో ఈ ఎదుగుదలకు సంబంధించిన కొన్ని సమస్యలు కనిపించవచ్చు. అలాగే చిన్నపిల్లలు చాక్లెట్లు, స్వీట్స్, జంక్‌ఫుడ్ వంటివి ఇష్టంగా తింటుంటారు. వేసవిలో కూల్‌డ్రింక్స్ తాగుతుంటారు. ఇవన్నీ నోటి ఆరోగ్యాన్ని దెబ్బతీసేవే. పిల్లల్లో వచ్చే కొన్ని సాధారణ డెంటల్ సమస్యలూ, వాటికి పరిష్కారాల కోసం ఈ కథనం.**

ఎముకలు పెరుగుతున్న కొద్దీ వచ్చే మార్పులు స్వాభావికమైనవి. అయితే ఎదిగే వయసులో ఉన్న కొందరు చిన్నారులు అలవాటుగా తమ వేలిని నోట్లో పెట్టుకుని థంబ్ సకింగ్ చేస్తుంటారు. ఇది నివారించాల్సిన విషయమే అయినప్పటికీ... పిల్లల సైకలాజికల్ ఎదుగుదల దృష్టితో చూస్తే వారి ఈ అలవాటును బలవంతంగా మాన్పకూడదనీ, క్రమంగా మాన్పించాలని నిపుణులు పేర్కొంటుంటారు. ఇలా ఎముకల పెరుగుదలతో వచ్చే మార్పులతోనూ, నోట్లో వేలుపెట్టుకునే అలవాటు వల్లా పలువరస షేప్ మారవచ్చు.

**కొన్ని సాధారణ దంతసమస్యలివి...**

**● పిప్పిపళ్లు ● చిగుర్ల సమస్యలు ● పాలపళ్లు సరైన సమయంలో ఊడకపోవడం ● ఎత్తు పళ్లు, ఎగుడుదిగుడు పళ్లు, పళ్ల మధ్య సందులతో సమస్యలు ● ముఖానికి దెబ్బలు తగలడం వల్ల వచ్చే సమస్యలు.**

**పిప్పిపళ్లు...**

దాదాపు 80 శాతానికిపైగా పిల్లల్లో పిప్పిపళ్లు, చిగుర్ల జబ్బులు కనిపిస్తుంటాయి. తీపి పదార్థాల ముక్కలు నోటిలోనే ఉండిపోవడంతో పెరిగిపోయిన బ్యాక్టీరియాతో పాటు వారు సరిగా బ్రష్ చేసుకోకపోవడం వల్ల ఆ పెరిగిన బ్యాక్టీరియా ఎక్కువ సంఖ్యలో నోటిలోనే ఉండిపోవడం, అవి విడుదల చేసే హానికర రసాయనాల వల్ల పళ్లలో రంధ్రాలు ఏర్పడి పిప్పిపళ్లు రావచ్చు. రంధ్రాల పరిమాణం పెరుగుతున్న కొద్దీ ఆహార వ్యర్థాలు అక్కడ ఎక్కువగా ఇరుక్కుపోవడం, దాంతో రంధ్రం మరింతగా పెరగడంతో పాటు ఇన్ఫెక్షన్స్ వచ్చి నొప్పి రావచ్చు. ఇలాంటి పిప్పిపళ్ల కారణంగా చిన్నారులు ఆహారం నమలడానికి ఇబ్బందిపడతారు. అన్నం తినడాన్ని అవాయిడ్ చేయడానికి ప్రయత్నిస్తుంటారు. తమకు వచ్చే నొప్పిని తల్లిదండ్రులకు సరిగా చెప్పలేక ఇలా అన్నం తినడానికి నిరాకరిస్తుంటారు. దాంతో ఎదుగుదల కూడా ఎంతో కొంత ప్రభావితం కావచ్చు.

**చికిత్స...**

పిప్పిపళ్లకు సరైన సమయంలో చికిత్స చేయించకపోతే ఇన్ఫెక్షన్ పంటి ఎముక వరకు చేరి, పాల పళ్లతో పాటు తర్వాత రావాల్సిన శాశ్వతదంతాలూ పాడయ్యే ముప్పు పొంచి ఉంటుంది. ఇలాంటి పిల్లలను దంతవైద్యులకు చూపించినప్పుడు వారు పంటిలోని రంధ్రాలను పూడ్చివేయడం, ఇన్ఫెక్షన్‌ను తగ్గించడానికి తగిన యాంటీబయాటిక్స్ ఇవ్వడం వంటి చికిత్సలు చేస్తారు.

**చిగుర్ల జబ్బులు...**

చిన్నారులకు బ్రషింగ్ నైపుణ్యాలు అంతగా తెలియకపోవడంతో పళ్లలో చిక్కుకున్న ఆహారపదార్థాలను సరిగా శుభ్రం చేసుకోకపోవడం కారణంగా పిప్పిపళ్లతో పాటు చిగుర్ల సమస్యలు వచ్చే ముప్పూ ఉంటుంది. దీనికో కారణముంది. నోట్లో విపరీతంగా పెరిగిపోయిన బ్యాక్టీరియా, ఆహారపదార్థాలతో కలిసి ప్లాక్, క్యాలిక్యులస్ అని పిలిచే మురికి సున్నితమైన చిగుర్ల చివర్లలోకి చేరుతుంది. ఈ మురికి కారణంగా చిగుర్లలో వాపు, కొందరిలో చిగుర్ల నుంచి రక్తస్రావం కావడం, నోటి దుర్వాసన వంటి సమస్యలు కూడా రావచ్చు. చిన్నవయసులోనే చిగుర్ల జబ్బు వస్తే పిల్లలు జీవితకాలం దృఢమైన పళ్లు లేక ఇబ్బంది పడవలసి రావచ్చు.



**చికిత్స...**

జింజివైటిస్ వంటి సమస్యలకు తగిన యాంటీబయాటిక్స్ వాడటంతో పాటు చిగుర్లకు వచ్చే సమస్యను బట్టి దంతవైద్యులు పలు రకాల చికిత్సలు అందిస్తారు.

**ఎత్తుపళ్లు, ఎగుడుదిగుడు పళ్లు / వంకరపళ్ల వంటి సమస్యలు...**

ఎత్తుపళ్లు అన్నది పిల్లలను ఆత్మన్యూనతకు గురిచేసే సమస్య. మొదట్లో ఇది నివారించదగిన సమస్యే అయినప్పటికీ, తల్లిదండ్రుల అవగాహనాలోపం, మరి కొందరిలో వారి నిర్లక్ష్యం వల్ల ఇది తీవ్రమవుతుంది.

**ఎత్తుపళ్లు / ఎగుడుదిగుడు పళ్లు / వంకర పళ్లకు కారణాలు...**

● ఎత్తుపళ్లు చాలావరకు వంశ పారంపర్యంగా వస్తుంటాయి. తల్లిదండ్రుల్లో ఒకరికిగానీ లేదా ఇద్దరికీ ఎత్తుపళ్లు ఉంటే పిల్లల్లోనూ వచ్చే అవకాశాలు 70 శాతానికి పైమాటే. పిల్లలకు ఎత్తుపళ్లు, ఎగుడుదిగుడు / వంకరపళ్లు, పళ్లమధ్య సందులు రాకుండా చేసే చికిత్సలు సైతం ఇప్పుడు అందుబాటులో ఉన్నాయి.

● నోట్లో వేలుపెట్టుకోవడం, పెదవులు కొరకడం, నాలుకతో పళ్లను ముందుకు తోస్తూ ఉండటం, నోటితోనే గాలిపీల్చడం వంటి అంశాలూ ఎత్తుపళ్లకు కారణమవుతుంటాయి. ఎదుగుతున్న చిన్నారుల దవడ ఎముకలు మైనంలా ఒత్తిడి పడుతున్న దిశకు వంగిపోతుంటాయి. ఈ కారణం వల్లనే ఇక్కడ పేర్కొన్న దురలవాట్లు ఉన్న పిల్లల్లో దవడ ఎముకల షేపు మారిపోయి పళ్లు ఎత్తుగా రావచ్చు.

● పాలపళ్లు సమయానికి ఊడిపోకపోయినా, పిప్పిపళ్లను ముందే తీసేయాల్సి వచ్చినా ఎత్తుపళ్లు లేదా ఎత్తు పళ్లు, ఎగుడుదిగుడు పళ్లు రావడానికి ఈ అంశాలు కూడా ఒక కారణం.

ఎదిగే వయసులోనే ఎత్తుపళ్లను, ఎగుడుదిగుడు దంతాలనూ, సరిచేయడం, పళ్ల మధ్యన ఉండే సందులు చక్కదిద్దడం చాలా సులువు. చికిత్స ఫలితాలు కూడా దాదాపు నూరు శాతం ఉంటాయి. ఎదిగే వయసులో వచ్చే 'గ్రోత్ స్పర్' అనేది చికిత్సకు ఎంతగానో ఉపయోగపడుతుంది. చికిత్స త్వరగా, సమర్థంగా జరిగేందుకు ఈ గ్రోత్ స్పర్ అంశం సహాయపడుతుంది.



డా. వికాస్ గౌడ్,
డెంటల్ సర్జన్ అండ్ ఇంప్లాంట్ స్పెషలిస్ట్

**ఎత్తుపళ్ల సమస్య రెండు రకాలుగా ఉండవచ్చు...**

● కేవలం పళ్లు మాత్రమే ఎత్తుగా ఉండటం ● పళ్లతో పాటు దవడ ఎముకలు కూడా ఎత్తుగా ఉండటం.

పిల్లలు నవ్వినప్పుడు చిగుర్లు ఎక్కువగా కనిపించడం, నిద్రపోతున్నప్పుడూ పెదవులు తెరచుకునే ఉండటం, పెదవులు ముందుకు వచ్చినట్లుగా కనపడటం వంటివి ఎముక కూడా ఎత్తు పెరిగిందని చెప్పడానికి గుర్తులు.

**చికిత్స...**

● ఎదిగే వయసులో ఎత్తుగా ఉన్నట్లు గుర్తిస్తే... ఎలాంటి శస్త్ర చికిత్సలూ లేకుండానే పళ్లు, దవడలను ప్రత్యేకమైన క్లిప్స్‌తో సరిచేయవచ్చు. అయితే... ఎదిగిన పిల్లల్లో దవడ ఎముకలు ఎత్తుగా ఉంటే సర్జరీ చేయాల్సి రావచ్చు.



● పళ్లు ఎత్తుగా ఉన్నా, పళ్ల మధ్య సందులు ఉన్నా, వంకర టింకరగా ఉన్నా, ఎగుడుదిగుడుగా ఉన్నా క్లిప్పులతో వాటిని సరిచేయవచ్చు. అయితే పిల్లలకు అమర్చాల్సిన క్లిప్పులు అందరిలో ఒకేలా ఉండవు. వ్యక్తిగతమైన పరీక్షల తర్వాతే వారికి సరిపోయేవాటిని నిర్ణయించాల్సి ఉంటుంది.

**పాలపళ్లు సరైన టైమ్‌లో ఊడకపోవడం...**

సాధారణంగా పాలపళ్లలోని ప్రతి పన్నూ ఓ నిర్దిష్ట సమయం తర్వాత ఊడుతుంది. శాశ్వత దంతం తయారై బయటకు రావడానికి సిద్ధంగా ఉన్నప్పుడే పాలపన్ను ఊడుతుంది. ఊడిన 3 నుంచి 4 నెలల్లో శాశ్వత దంతం వచ్చేస్తుంది.

ఏ కారణం వల్లనైనా పాలపన్ను ఊడకపోతే, దానికి ముందువైపో, వెనకవైపు నుంచో శాశ్వత దంతం వస్తుంది. (కొన్నిసార్లు పాల పన్ను ఊడకపోవడం వల్ల శాశ్వత దంతం బయటకు రాలేక చిగురులోనే చిక్కుకుపోవచ్చు కూడా). దాంతో రెండు వరసల్లో పళ్లు కనపడతాయి. అందుకే ఆరేళ్లు దాటిన పిల్లలను దంతనిపుణులకు తరచూ చూపిస్తూ పాలపళ్లు సరైన సమయంలోనే పడిపోతున్నాయా లేదా అని పరీక్ష చేయిస్తూ ఉండాలి. అవసరాన్ని బట్టి వారి పర్యవేక్షణలో చికిత్స చేయించాలి.

**పరీక్షలు :** ఎక్స్‌-రే సహాయంతో పాలపళ్లు, శాశ్వత దంతాలను, శాశ్వతదంతాలను చిక్కుకుపోయిన తీరును దంతవైద్యులు తెలుసుకోగలరు.

**ముఖానికి దెబ్బలు తగలడం వల్ల...**

ఎదిగే పిల్లలు ఆటలాడుతుంటారు. పైగా ఇవి సెలవురోజులు కావడం ఆడుకోవడం మరింత ఎక్కువ. ఆటల్లో పరుగెత్తుతూ పడిపోవడం, దెబ్బలు తగలడం, క్రికెట్ బంతి లేదా ఇతర బంతుల వంటివి తగలడం, పిల్లలు పోట్లాడుకోవడం వంటి చర్యలతో ముఖానికి దెబ్బలు తగలడం, పళ్లు విరగడం / వంగిపోవడం, దెబ్బలు తీవ్రమైనవైతే పెదవులు చీలడం, ముక్కు వంకర కావడం కూడా జరగవచ్చు.

ఇలా దెబ్బలు తగిలినప్పుడు వెంటనే చికిత్స చేయించాలి. నిర్లక్ష్యం చేస్తే పలువరస షేపు మారడం, పళ్లపై గుర్తులు ఏర్పడి అలాగే ఉండిపోవడం జరగవచ్చు. అందుకే పన్ను విరిగినా, ఊడినా వెంటనే ఆ ముక్కను పాలలో లేదా మంచినీళ్లలో ఉంచి దంతవైద్యులను కలవాలి.



వేసవి సెలవులు దంతవైద్యం చేయించడానికి అనువైన సమయం. ఈ సమయంలో స్కూళ్లకు సెలవులు ఉంటాయి కాబట్టి పిల్లల చదువులు వృథా కాకుండానే చికిత్స చేయించవచ్చు. పైగా చికిత్స తర్వాత వారు ఇంటిపట్టునే ఉంటారు కాబట్టి టైముకు మందులు ఇవ్వడానికి, తగిన జాగ్రత్తలు తీసుకోడానికి, పిల్లలకు తగినంత విశ్రాంతి ఇవ్వడానికి సెలవులన్నవి సరైన సమయం. కాబట్టి తల్లిదండ్రులు ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకుని, పంటి సమస్యలున్న పిల్లలకు తగిన వైద్యసహాయం అందించవచ్చు.

● ఫుడ్

వేసవిలో పిల్లలకు ఆహారం ఇవ్వాలంటే రెండు అంశాలు గుర్తుపెట్టుకోవాలి. మొదటిది వేసవి వేడిమి. రెండోది సెలవుల్లో వాళ్ల ఆటలు. నగరాల్లోని పిల్లలు ఎండల్లో పెద్దగా ఆడే అవకాశం లేకపోయినా పట్టణాల్లో, పల్లెల్లోని పిల్లలు ఇలా ఎండ వేడిమిలో ఆడటం మామూలే. అలాగే పెద్ద నగరాల్లోంచి సెలవులకు పల్లెలకు వచ్చే పిల్లల సంఖ్య తగ్గినప్పటికీ... కొంతమంది ఇప్పటికీ ఇలా వచ్చేవారు లేకపోలేదు. ఇలా వేసవిలోని వేడిమిని తట్టుకుంటూ... ఎక్కువ సమయం ఆటలకు ఇచ్చుకుంటూ ఉండేందుకు అవసరమైన శక్తిని సమకూరుస్తూ ఉండటానికి చిన్నారులకు ఎలాంటి ఆహారం ఇవ్వాలో తెలిపే కథనం.



**● అధిక శక్తికోసం పాల ఉత్పత్తులు...**

పిల్లలకు తాజా లస్సీ, తాజా మజ్జిగ, ఫ్లేవర్డ్ మిల్క్, ఫ్రూట్ మిల్క్ షేక్‌లు (మ్యాంగో మిల్క్ షేక్) వంటివి ఇవ్వడం వల్ల ఒకపక్క అవి ద్రవాహారాలుగా వారు కోల్పోయే నీరు లవణాలను భర్తీ చేయడంతో పాటు ప్రొటీన్లనూ అందజేస్తాయి. ఎదిగే వయసులో ఎముకల బలం కోసం క్యాల్షియమ్‌ను ఇస్తాయి.

**● తాజా పండ్లు...** పిల్లలకు తాజా పండ్లు తినిపించడం ఎప్పుడూ మంచిదే. కాకపోతే పండ్ల రసాలకు బదులు వీలైనంతగా పండ్లను కొరికి తినేలా చూడాలి. ద్రవాలను భర్తీ చేయడం కోసం, వేసవి ఉపశమనం కోసం అప్పుడప్పుడూ చల్లగా ఉండే తాజా పండ్ల రసాలనూ ఇవ్వవచ్చుగానీ... వీలైనంత వరకు వాటిలో చక్కెర కలపకపోవడం మంచిది.

**● జంక్‌ఫుడ్ వద్దు...** బర్గర్‌లు, పిజ్జాలు, చిప్స్ వంటి వాటి కోసం వాళ్లు మారాం చేస్తున్నప్పటికీ ఆరోగ్యానికి అవి హానికరమంటూ వాళ్లను సముదాయించడం మంచిది. ఆ వయసు పిల్లలను సమాధానపరచడం కష్టం కాబట్టి వాటిలో పనీర్, తాజాకూరగాయలు పుష్కలంగా నింపి ఇవ్వడం మంచిది. అయితే వాటిల్లో చీజ్ ఎక్కువగా ఉన్నవాటిని తినిపించడం అంతగా మంచిది కాదు. మరీ మారాం చేస్తుంటే గ్రిల్డ్ వెజిటబుల్స్‌ను పనీర్‌తో కలిపి ఇవ్వవచ్చు.

**● ఐస్‌క్రీముల విషయంలో...**

వేసవిలో ఐస్‌క్రీములు అడగని పిల్లలు ఉండరు. ఇంట్లో తయారు చేసిన ఐస్‌క్రీమ్‌లు, ఫ్రూట్ కస్టర్డ్స్, పుడింగ్స్, స్మూతీస్ వంటివి పిల్లలకి పెట్టవచ్చు. ఇవి ఆరోగ్యకరమే. ఇక కూల్ డ్రింక్స్ కోసమూ డిమాండ్ ఎక్కువగానే ఉండవచ్చుగానీ వాటిని ఇవ్వడం అంతమంచిది కాదని గుర్తుంచుకోండి